# అన్నదానం




ప్రసన్నకుమార్ సర్రాజు

ధబ్ మని చప్పుడయింది.

అకస్మాత్తుగా వింటే ఏదో ఆలోచనతో

అంటూ వీపు గుద్దుకుసేంత భయంకర శబ్దం కాదది.

వుంటారు

ఆలస్యంగావచ్చో, లేక మొదటి పంక్తిలో చోటు లేకో, రెండో పంక్తి కోసం ఎదురు చూసేవాళ్ళు.....

వడ్డించిన విస్తరిలాంటి జీవులు నాజూకుగా ఎంగిలిపడి లేచిపోయాక కిందపడే ఆ 'కట్ట' కోసం కలిసికట్టుగా ఎదురుచూసే వాళ్లు.

ఈ రెండు తరగతులకీ వున్న దూరం ఆహారధాన్యాల మూటలు విసిరేసే సర్కారువారి విమానానికీ, వరద బాధితులకీ వున్నంత దూరం.

విసిరేసే చేతికి, చాపే చేతికి వున్నంత దూరం.

ఆ శబ్దం-మొదటి పంక్తి అయిపోయిందని సూచించే గంట.

ఆ శబ్దం—వీనుల విందుగా వినిపించి తాత్కాలికంగా చల్లార్చే కడుపుమంట.

భోజనాలకు వచ్చిన వాళ్ళకు మర్యాదలు చేయటంలో సతమతమవుతూనే ఆ శబ్దం విన్నాడు చక్రపాణి అప్రయత్నంగా డాబా మీదనుంచి కిందకు చూశాడు.

ఎప్పుడు కిందపడతాయా అని ఎదురు చూస్తున్నాడు.... ఆ విస్తళ్ళకట్ట పడగానే పరుగు పరుగున వచ్చాడు ఆ వ్యక్తి.

మనిషి చిక్కిపోయిలేడు. కానీ ఆ మురికి అవతారం, పీలికలై వ్రేలాడుతున్న చొక్కా, తైల సంస్కారంలేని జుట్టు, రెండు పూటలా తిండికోసం ఎప్పటికప్పుడు బిజీగా వుండి తమ విషయం పట్టించుకోవటం లేదని ఫిర్యాదు చేస్తున్నట్లున్నాయి.

అదే సమయంలో ఎక్కడినుంచి వచ్చాయో రెండు గ్రామసింహాలు—కాళ్లు చేతులు వుండి నువ్వు కూడా ఇలా మాకు పోటీ వస్తే ఇక మేం బతికేదెలా అన్నట్టు వాటి భాషలో పోట్లాడుతూ అరుస్తూ మీద మీదకి వచ్చాయి.

వాడు కిందకు వంగాడు. కాళ్లు చేతులు సరిగా వుండేవారు చేసే పనులలో ఇది కూడా ఒకటి అన్నట్లు రెండు రాళ్లు చేతిలోకి తీసుకున్నాడు. శక్తికొద్దీ గురిగా విసిరాడు.

కుయ్యో మంటూఅరిచాయి...ఇకలాభం లేదనుకుని దూరంగా వెళ్ళిపోయాయి.

చక్రపాణి ఇల్లు వూరికి కాస్త దూరంగానే వుంది. ఇక్కడ ఆరోజు ఎంగిలాకుల విందు వుందని వాడిలాంటి జీవాలకు తెలిసే అవకాశంలేదు. అందుకే వాడికి పోటీలేదు అక్కడ.

చెత్తకుండీకి కాస్త దూరంగా గొంతు కూర్చున్నాడు, తీరిగ్గా కట్ట విప్పాడు, పై ఆకులోవున్న పదార్థాలు కింద వున్న బొత్తి మీదకు దులిపాడు. ఆతర్వాత ఖాళీ అయిన ఆకు ప్రక్కనపెట్టి, మిగిలిన ఆకుల్లోని పదార్థాలు ఒక్కొక్కటీ తీసి ఆ ఆకులో పెట్టాడు.

చక్రపాణి తల తిప్పుకున్నాడు. మనసంతా అదోలా అయిపోయింది. అప్పటివరకూ దహిస్తున్న ఆకలి ఒక్కసారి బిందెడు నీళ్ళు తాగినట్లు ఆరిపోయింది.

ఆకలి ఆరిపోవడమేమిటి?


"అగ్నివంటిది ఆకలి. అగ్ని దేన్నయినా దహించివేయును. ఆకలి ఎంత పనైనా చేయించును."

రెండు రోజులయినా వాడు ఆ వీధి వదల లేదు గృహప్రవేశం సందర్భంగా సత్యనారాయణ వ్రతం చేసుకున్న రోజు ఆవీధిలోకి వచ్చాడు వాడు. ఆ ఒక్కరోజుకే ఆ విందు భోజనం-మరి తరువాత?

చక్రపాణి, భార్యని వాకబుచేశాడు. ఆ వీధిలో తాముకాక ఆరు బ్రహ్మణ కుటుంబాలు వున్నాయట. వాళ్ళ ఇళ్ళనుంచే రోజూ ఓ పది విస్తళ్ళయినా ఆకుండీలో పడుతుంటాయని మామూలుగా చెప్పింది శ్రీమతి.

చక్రపాణి మధ్యాహ్నంపూట ఆఫీసు నుంచి ఇంటికి భోజనానికి వస్తూంటాడు. కానీ భోజనం ఇష్టంగా చెయ్యడమంటే ఏమిటో మరచిపోయాడు.

కారణం....




రోజూ మధ్యాహ్నం ఇంట్లోకి అడుగు పెట్టె సమయంలో కుండీకి కాస్త దూరంగా తాజాగా పడిన ఎంగిలాకులని భోంచేస్తూ "వాడు" కనిపించటమే.

చక్రపాణికి ఈ విషయం చాలా చిరాకుగా అనిపించింది. అందరిలా పట్టించుకోకుండా తానుండ లేడు-

పట్టించుకుంటే అసలుండలేడు.

ఒక రోజు మధ్యాహ్నం ఆఫీసునుంచి ఇంటికి వచ్చాడు. కుండీలో విస్తళ్ళు ఇంకా పడలేదేమో వాడు తలవంచుకుని ఎదురింటి అరుగు నానుకుని కూర్చున్నాడు.

ఆ అరుగు గల ఇల్లు ఎప్పుడూ తాళం వేసేవుంటుంది. అందుకని అక్కడే వాడి నివాసం ఏర్పరచుకున్నాడు.

చక్రపాణి ఒక నిశ్చయానికి వచ్చాడు.

"ఏయ్..ఇలారా."—పిలిచాడు.

వాడు తలతిప్పి చూశాడు. లేవలేదు. తనను కాదనుకున్నాడేమో మళ్ళీ తల వంచుకుని కూర్చున్నాడు.

చక్రపాణి మళ్ళీ పిలిచాడు.

ఈసారి చటుక్కున తలెత్తాడు. చక్రపాణి వాడివంకే చూస్తూండటంతో తననే పిలిచాడని గ్రహించాడు.

లేచి భయంగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చాడు. దూరంగా నిలుచున్నాడు.

చేతులు కట్టుకోలేదు. కొంచెంకూడా వంగ లేదు. కానీ కొంచెం తల వంచి చక్రపాణి వంకే చూస్తూన్నాడు. కళ్ళలో బెదురు వుంది.

పిల్చాడేగానీ చక్రపాణికి ఏంమాట్లాడాలో తోచలేదు. కాస్సేపాగి, "ఈ రోజు నుంచి నువ్వు ఆ ఎంగిలాకులు తినకు" అనేశాడు.

ఈసారి వాడు భయపడుతున్నంతా జరిగిందన్న భావం వాడి ముఖంలో కనిపించింది చక్రపాణికి.

ఎంగిలాకులు తినటం వాడి జన్మ హక్కయినట్లు, ఆ హక్కుని తాను వదులుకోవటం ఇష్టంలేనట్లు, నిరసన కదలాడింది వాడి కళ్ళల్లో.

వాడు మూగవాడు కాదని చక్రపాణికి తెలుసు అయినా మాట్లాడడు....

మాట్లాడటం మరచిపోయి కొన్ని ఏళ్ళయింది వాడికి. తనలో తను తప్ప మాట్లాడుకోడు. కుక్కలతో తప్ప పోట్లాడడు. వాడు మనిషితో మాట్లాడటం అవమానంగా భావించాడో లేక తనని తాను మనిషిగా గుర్తించలేదేమో....

అందుకే మాట్లాడడు.

వాడు మనిషితో మాట్లాడితే కోర్టు డఫేదారు చనువుగా మేజిస్ట్రేటు భుజంమీద చెయ్యేసినట్లుంటుంది. లేక పోలీసుకానిస్టేబుల్ ముఖ్యమంత్రి జుట్టులో ఇరుక్కున్న గడ్డిపరకను చేతితో తీసివేసి నట్లుంటుంది.

అందుకే వాడు మనిషితో మాట్లాడడు.

"రోజూ నేను భోజనం పెట్టిస్తాను. అర్థమయిందా?" వాడికి చక్రపాణి మాట్లాడిన మాటలు బాగా వినపడ్డాయి. అర్థాంతరంగా వచ్చిన ఈ ఆహ్వానానికి అర్థం కాకపోయినా అర్థవంతంగా తలవూపాడు.

చక్రపాణి లోపలికి వెళ్ళిపోయాడు. వాడు నెమ్మదిగా గోడదగ్గిర కూర్చున్నాడు.

ఐదు నిముషాల తర్వాత చక్రపాణి ఇంట్లోంచి పనిమనిషి వచ్చింది.... విస్తట్లో అన్నం పెట్టుకుని.

అది చూడగానే ఛటుక్కున లేచి నిల్చున్నాడు.

భుజాన వ్రేలాడుతున్న తువ్వాలు రెండు చేతులతో పట్టాడు. దానిలో విస్తరి పడేసి లోపలికి వెళ్ళిపోయింది. అరుగు దగ్గరకు చేరుకున్నాడు. ఎప్పుడో పట్టి వుంచుకున్న నీళ్లు ఒక రేకు డబ్బాలో వున్నాయి. తృప్తిగా ఆత్రంగా చాలా క్షాలం తరువాత ఎంగిలి విస్తట్లో భోజనం చేశాడు.

చూడకూడదు అనుకుంటూనే వాడు అన్నం తినటం మేడమీద కిటికీలోంచి చూశాడు చక్రపాణి. అతని మనసుకేదో తృప్తిగా అనిపించింది. కానీ ఈ ఒక్కపూట వాడికి అన్నంపెడితే సరిపోతుందా?

సరిపోదని, అలా సరిపుచ్చుకుంటే తాను జమ అయిపోతాడని తెలుస్తూనే వున్నది చక్రపాణికి.... మరి....?

అందుకే ఒక నిశ్చయానికి వచ్చాడు. పది మందికైతే ఏమో చెప్పలేడు గానీ ఒక్కడికి రోజూ రెండుపూట్లా అన్నంపెట్టే తాహతు తనకుంది.

నాలుగు రోజులుగా వాడికి చక్రపాణి ఇంట్లో నుంచి పని మనిషి ద్వారా భోజనం అందుతూనే వుంది. వాడి ముఖంలో కాస్త కళ వచ్చినట్లు కూడా చక్రపాణి గమనించాడు.

ఎందుకు వాణ్ణి వూరికే మేపటం అని భార్య కసురుకుంది. వాడిచేత పనిచేయించుకుందాం అని సూచించింది. దానికి చక్రపాణి మనసు ఒప్పుకోలేదు. ప్రతిఫలం ఆశించి వాడికి అన్నం పెట్టినట్లు అవుతుందనీ, అది ఆత్మవంచన అనీ అనుకున్నాడు. అదీ గాక....... అంతరాంతరాల్లో తరతరాలుగా రక్తంలో జీర్ణించుకుపోయిన జుగుప్స.... ఎంగిలాకులు తినేవాడిని లోపలికి రానివ్వడమే........ అసంభవం అనే అంతస్యం కూడా ఆ ప్రతిపాదనకు ఒప్పుకోలేదు.

తరువాత చక్రపాణి వాడి విషయం అంతగా పట్టించుకోవటం మానేశాడు. అతనికి తెలుసు తన ఆర్డర్ ప్రకారం వాడికి రోజూ భోజనం అందుతూనే వుంటుందని.

ఇక ఇంటికి వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు వాడెక్కడవున్నాడో చూడటం మానేశాడు.

వాడి అవతారం.... మొహం వాచి ఎంగిలాకులు తినటం చూడలేక గదా భోజనం ఏర్పాటు చేశాడు. తర్వాతకూడా వాడి మంచి చెడ్డలు కనుక్కోవటం అనవసరం అనిపించింది. తన వ్యవహారాలతో బిజీగా వున్నాడు.

నెల రోజులు గడిచాయి.

ఒకరోజు అర్ధరాత్రి చక్రపాణి మామగారికి సీరియస్‌గా వుందని టెలిగ్రామ్ వచ్చింది. వెంటనే భార్య, పిల్లలతో టాక్సీ

స్టాండుకు వెళ్ళి ఒక టాక్సీ కుదుర్చుకుని మామగారి ఊరువెళ్ళాడు.

ఆయన అప్పటికే పరమపదించాడు—పదమూడోరోజు దాకా వుండి, ఇక సెలవు లేదని ఒక్కడే ప్రయాణమయ్యాడు.

బస్సులో గానీ గుర్తుకురాలేదు చక్రపాణికి. ఇల్లు తాళం వేశామని, వాడు పాపం భోజనం కోసం ఎదురు చూస్తూ వుంటాడని.

పెద్దగా పట్టించుకోలేదు. ఎప్పుడైతే తన ఇంట్లోనుంచి భోజనం వెళ్ళలేదో, వాడికి ఎంగిలాకులు రెడీగానే వుంటాయిగదా! మళ్ళీ శ్రీమతి వస్తేగానీ భోజనం దక్కదు. ఎప్పటిలా అప్పటివరకూ తనకూ హోటల్ కూడే గతి.

సాయంత్రం 5గంటలయింది - చక్రపాణి రిక్షాదిగాడు ఇంటిముందర. డబ్బులిచ్చి, తాళం తీసి లోపలికెళ్ళాడు. ఇల్లంతా దుమ్ము కొట్టుకని వుంది.

చక్రపాణి వచ్చిన విషయం తెలిసి, పక్కింట్లో పని చేస్తున్న పని మనిషి వచ్చింది.

"అమ్మగారు రాలేదా బాబూ" అంది

దానికి సమాధానం చెప్పి, స్నానంచేసి, బాల్కనీలో కుర్చీ వేసుకని కూర్చున్నాడు.

పని మనిషి ఇల్లు శుభ్రం చేస్తోంది.

అప్రయత్నంగా కిందకు చూశాడు. చెత్తకుండీనిండా అరిటాకులు పేరుకుపోయి వున్నై.

చటుక్కున చుట్టుపక్కల చూశాడు. వాడు కనిపించలేదు. 'లక్ష్మి' కేక వేశాడు.

"ఏంటి బాబూ" అంటూ వచ్చింది పని మనిషి.

"వాడు.... మనం రోజూ అన్నంపెట్టే వాళ్ళమే.... ఏడీ?" అడిగాడు.

"ఆడా బాబూ.... చచ్చిపోయాడు"

అదిరిపడ్డాడు చక్రపాణి "చచ్చిపోయాడా! ఎలా!!"

"తిండిలేక...."

"తిండిలేక ఏమిటి? రోజూ ఎంగిలాకులు కుండీ నిండా పడుతూనే వున్నైగా! ఎప్పటిలాగా అవి తిని బతకలేకపోయాడా?"

"ఆడికి సూకరం ఎక్కువైంది బాబూ. మీ రెళ్ళిపోయాక రెండు రోజులు మీరు ఒస్తారేమో, అని ఎదురు సూశాడు. కానీ మీరు రాలేదుగదా! తర్వాత ఎంగిలాకులు తిందామనే కుండీదాకా పోవటం, ఎనక్కి ఎల్లిపోవటం.... నేనంతా గమనిత్తానే వున్నాను బాబూ........ అసలాడికి మీరు నేర్పారు లెండి ... ఆడికి మంచి భోజనం తినటం అలవాటుకాగానే ఆ ఎంగిలాకులు తినలేక పోయాడు. ఈ యీదిలో మీలాగ గుప్పెడన్నం పెడదామని ఎవరికుంది? ఎవరూ పట్టించుకోలేదాణ్ణి అలాగే ఆకలితో మాడాడు పాపం....నాలుగు రోజుల కిందట సచ్చిపోయాడు బాబూ....మున్సిపాలిటీ వోళ్ళు ఆడి శవాన్ని...."

ఇక వినలేక పోయాడు చక్రపాణి.

నాదే తప్పు.... నాదే తప్పు....వాడిని ఎప్పటిలా ఎంగిలాకులు తినేవాడిగా ఉంచేస్తేనే బాగుండేది.... వాడికి అన్నంపెట్టి చంపాను.... అన్నంపెట్టి చంపాను.... అని బాధపడుతూ, చాలా రోజుల వరకూ ఆ షాక్ నుంచీ కోలుకోలేక పోయాడు చక్రపాణి. ✳

